
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY
5

అల్లూరి సీతారామరాజు
జిల్లా వార్తలు
గురువారం 6 జూన్ 2024

నీట్‌లో ప్రతిభ
- విశాఖ విద్యార్థులకు 304, 322, 360, 442 ర్యాంకులు
- 1000లోపు పాతిక మందికి ర్యాంకులు

· 7లో


సూర్యచరణ్ (304 ర్యాంకు)


కిరణ్ రాజాన (360 ర్యాంకు)

మన్యంలోనూ క్రాస్ ఓటింగ్

- ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులకు పడిన ఓట్లలో భారీ తేడా
- అధికంగా ఇండియా కూటమి అభ్యర్థుల మధ్య వ్యత్యాసం



పాడేరు, జూన్ 5(ఆంధ్రజ్యోతి): ఏజెన్సీలోని పాడేరు, అరకులోయ అసెంబ్లీ స్థానాల్లో అధికంగానే క్రాస్ ఓటింగ్ జరిగింది. ప్రధాన పార్టీలకు చెందిన ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులకు లభించిన ఓట్ల మధ్య చాలా వ్యత్యాసం ఉండడమే ఇందుకు నిదర్శనం. గిరిజన ప్రాంతంలో అధికంగా నిరక్షరాస్యులుండడంతో క్రాస్ ఓటింగ్‌పై అవగాహన ఉండదనే భావన అందరిలో ఉంది. కానీ అందుకు భిన్నంగా ఏజెన్సీలో ఈసారి ఎన్నికల్లో క్రాస్ ఓటింగ్ జరిగింది. పాడేరు అసెంబ్లీ నియోజకవర్గంలో వైసీపీ ఎంపీ అభ్యర్థి తనూజారాణికి 69,802 ఓట్లు పడగా, ఎమ్మెల్యే అభ్యర్థి విశ్వేశ్వరరాజుకు 67,333 దక్కడంతో వారి మధ్య 2,469 ఓట్ల తేడా ఉంది. అలాగే కూటమి(బీజేపీ) ఎంపీ అభ్యర్థి కొత్తపల్లి గీతకు 35,836 ఓట్లు, ఎమ్మెల్యే అభ్యర్థి గిడ్డి ఈశ్వరికి 47,468 ఓట్లు రాగా, 11,632 ఓట్లు తేడా ఉంది. ఇండియా కూటమి(సీపీఎం) అభ్యర్థి అప్పలనర్సకు 27,700 ఓట్లు, ఎమ్మెల్యే(కాంగ్రెస్) అభ్యర్థి సతకా బుల్లిబాబుకు 13,566 పడగా, వారిద్దరి మధ్య 14,134 ఓట్లు తేడా వచ్చింది. అరకులోయ అసెంబ్లీ స్థానంలో వైసీపీ ఎంపీ అభ్యర్థి తనూజారాణికి 62,862, ఎమ్మెల్యే అభ్యర్థి రేగం మత్స్యలింగంకు 64,983 ఓట్లు వచ్చాయి. ఇక్కడ ఎంపీ కంటే ఎమ్మెల్యేకే 2,121 ఓట్లు అధికంగా పడ్డాయి. అలాగే బీజేపీ ఎంపీ అభ్యర్థి కొత్తపల్లి గీతకు 29,824 ఓట్లు, బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి పాంగి రాజారావుకు 32,933 ఓట్లు దక్కగా, ఎంపీ కంటే ఎమ్మెల్యేకు 3,109 అధికంగా పడ్డాయి. ఇండియా కూటమి(సీపీఎం) ఎంపీ అభ్యర్థి అప్పలనర్సకు 45,109 ఓట్లు, ఎమ్మెల్యే (కాంగ్రెస్) అభ్యర్థి శెట్టి గంగాధరస్వామికి 11,895కి ఓట్లు వచ్చాయి. అంటే ఎమ్మెల్యే కంటే ఎంపీ అభ్యర్థికి 33,214 ఓట్లు అధికంగా వచ్చాయి. దీంతో గిరిజన ప్రాంతంలో జరిగిన క్రాస్ ఓటింగ్‌పై సర్వత్రా చర్చ జరుగుతోంది.

పాడేరు, అరకులోయ అసెంబ్లీ స్థానాల్లో ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులకు వచ్చిన ఓట్లు

నియోజకవర్గం	వైసీపీ అభ్యర్థులు		కూటమి అభ్యర్థులు		ఇండియా కూటమి	
స్థానం	ఎంపీ	ఎమ్మెల్యే	ఎంపీ	ఎమ్మెల్యే	ఎంపీ	ఎమ్మెల్యే
పాడేరు	69,802	67,333	35,836	47,468	27,700	13,566
అరకులోయ	62,862	64,983	29,824	32,933	45,109	11,895

పట్టు సడలని వైసీపీ

పాడేరు, అరకులోయ స్థానాలను దక్కించుకున్న వైనం

పాడేరులో 42 శాతం, అరకులోయలో 37 శాతం ఓట్లు



పాడేరు, జూన్ 5(ఆంధ్రజ్యోతి): మన్యంలో వైసీపీ తన పట్టును నిలబెట్టుకున్నది. గత రెండు ఎన్నికల్లోనూ పాడేరు, అరకులోయ అసెంబ్లీ స్థానాల్లో విజయం సాధించిన వైసీపీ, తాజా ఎన్నికల్లోనూ గెలుపొంది గిరిజనుల్లో తమ పట్టును కోల్పోలేదని నిరూపించుకుంది.

పాడేరు అసెంబ్లీ నియోజవర్గంలో మొత్తం 1,58,747 ఓట్లలో వైసీపీ అభ్యర్థి విశ్వేశ్వరరాజుకు 67,333 ఓట్లతో 42 శాతం, టీడీపీ అభ్యర్థి గిడ్డి ఈశ్వరి 47,468 ఓట్లతో 30 శాతం, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సతకా బుల్లిబాబు 13,566 ఓట్లతో 8 శాతం దక్కించుకోగా మిలిగిన ఇతర అభ్యర్థులంతా 30,280 ఓట్లు పొందారు. అలాగే నోటాకు 1,408(0.8 శాతం) ఓట్లు పడ్డాయి. అలాగే అరకులోయ అసెంబ్లీ స్థానంలో మొత్తం 1,74,588 ఓట్లకు వైసీపీ అభ్యర్థి రేగం మత్స్యలిగం 64,983 ఓట్లతో 37 శాతం, బీజేపీ అభ్యర్థి పాంగి రాజరావు 32,933 ఓట్లతో 18 శాతం, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి శెట్టి గంగాధరస్వామికి 11,895 ఓట్లతో 6 శాతం దక్కింది. ఇతర అభ్యర్థుందరూ 64,777 ఓట్లు పొంది 37 శాతంకాగా, నోటాకు సైతం 3,567(2 శాతం) ఓట్లు పడ్డాయి. అనేక మంది స్వతంత్ర అభ్యర్థులకు నోటాకు వచ్చినన్ని ఓట్లు కూడా రాకపోవడం గమనార్హం.

పాడేరు, అరకు అసెంబ్లీ స్థానాల్లో ఓటింగ్ శాతం

నియోజకవర్గం	పోలైన ఓట్లు	వైసీపీ	శాతం	కూటమి	శాతం	ఇండియాకూటమి	శాతం	ఇతరులు	శాతం	నోటా	శాతం
పాడేరు	1,58,747	67,333	42	47,468	30	13,566	8	30,280	18.2	1,408	0.8
అరకులోయ	1,74,588	64,983	37	32,933	18	11,895	6	64,777	37	3,567	2.0

అమాత్యులు అయ్యేదెవరో?

ఉమ్మడి జిల్లా నుంచి పోటీ తీవ్రం

రేసులో సీనియర్లు చింతకాయల అయ్యన్నపాత్రుడు, గంటా శ్రీనివాసరావు, బండారు సత్యనారాయణ మూర్తి

- రాష్ట్రంలోనే అత్యధిక మెజారిటీ సాధించిన పల్లా శ్రీనివాసరావుకు బీసీ కోటాలో అవకాశం?
- మహిళా ఎస్సీ కోటాలో తనకు చాన్స్ దక్కుతుందంటున్న అనిత
- జనసేన నుంచి 'కొణతాల'కు, బీజేపీ నుంచి విష్ణుకుమార్‌రాజు పేర్లు పరిశీలన
- కేంద్ర మంత్రి పదవికి విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్ పేరును పరిశీలనకు తీసుకునే చాన్స్ ఉందంటున్న పార్టీ వర్గాలు


అయ్యన్నపాత్రుడు


కొణతాల రామకృష్ణ


బండారు సత్యనారాయణ


వంగలపూడి అనిత


పల్లా శ్రీనివాసరావు


గంటా శ్రీనివాసరావు


పి.విష్ణుకుమార్ రాజు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

రాష్ట్ర శాసనసభ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు భారీ విజయం సాధించడంతో మంత్రి పదవులకు పోటీ పెరిగింది. ఉమ్మడి విశాఖ జిల్లాలో సీనియర్ నాయకులు, భారీ మెజారిటీతో గెలిచిన వారు మంత్రి పదవులను ఆశిస్తున్నారు. గెలిచిన వారిలో చాలామంది హ్యాట్రిక్ సాధించిన వారు ఉన్నారు. మరికొందరు రాష్ట్రంలోనే అత్యధిక మెజారిటీ సాధించారు. ఎవరికి వారు సీనియారిటీ, అత్యధిక ఓట్లు, సామాజిక వర్గ ప్రాధాన్యం చూపిస్తూ తమకు అర్హతలు ఉన్నాయని చెబుతున్నారు. ఈసారి మంత్రివర్గంలో కూటమిలో భాగస్వామ్య పార్టీలైన జనసేన, బీజేపీలకు కూడా ప్రాధాన్యం లభించనుంది.

తెలుగుదేశం పార్టీని తీసుకుంటే సీనియర్ నాయకులు చింతకాయల అయ్యన్నపాత్రుడు, గంటా శ్రీనివాసరావు, బండారు సత్యనారాయణమూర్తి గతంలో మంత్రులుగా పనిచేశారు. మరోసారి అవకాశం లభిస్తుందని ఆశిస్తున్నారు. అలాగే వెలగపూడి రామకృష్ణబాబు, పెతకంశెట్టి గణబాబులు నాలుగోసారి ఎమ్మెల్యేలుగా గెలిచారు. ఈసారి అదృష్టం వరిస్తుందేమోనని భావిస్తున్నారు. ఇక గాజువాక నుంచి పోటీ చేసిన పల్లా శ్రీనివాసరావు రాష్ట్రంలోనే భారీ మెజారిటీతో గెలిచారు. ఆయన పార్టీ విశాఖ నగర అధ్యక్షునిగా పనిచేశారు. వైసీపీ వేధించినా వెనక్కి తగ్గలేదు. ఆఫర్లు ఇచ్చినా ఆశపడలేదు. బీసీ కోటాలో ఆయనకు చంద్రబాబునాయుడు ఈసారి మంత్రి పదవి ఇస్తారని ప్రచారం జరుగుతోంది. అలాగే మహిళ, ఎస్.సి. కోటాలో తనకు పదవి వచ్చే అవకాశం ఉందని పాయకరావుపేట నుంచి గెలిచిన వంగలపూడి అనిత భావిస్తున్నారు.

జనసేన నుంచి

జనసేన పార్టీ ఉమ్మడి విశాఖ జిల్లాలో నాలుగు స్థానాలు దక్కించుకుంది. విశాఖపట్నం దక్షిణ నియోజకవర్గం నుంచి వంశీకృష్ణ శ్రీనివాస్, అనకాపల్లి నుంచి కొణతాల రామకృష్ణ, పెందుర్తి నుంచి పంచకర్ల రమేశ్‌బాబు, ఎలమంచిలి నుంచి సుందరపు విజయకుమార్ గెలుపొందారు. జనసేనకు లభించే మంత్రి పదవుల్లో ఉత్తరాంధ్ర(విశాఖ)కు ఒకటి కేటాయించే అవకాశం ఉంది. అలా చూస్తే ఈ ముగ్గురిలో కొణతాల రామకృష్ణ సీనియర్. ఆయన గతంలో వైఎస్ హయాంలో మంత్రిగా పనిచేశారు. జనసేనలో ఎన్నికల ముందే చేరినా కీలకంగా ఉన్నారు. ఆయనకు ఎక్కువ అవకాశాలు ఉన్నాయని అంటున్నారు. కాపు సామాజికవర్గం కోటాలో ఉత్తరాంధ్రకు

... మిగతా 7వ పేజీలో

కూటమికే పోస్టల్ ఓట్లు అధికం

పాడేరులో టీడీపీకి 1,365, అరకులోయలో బీజేపీకి 848 ఓట్లు

కూటమికి ఓట్లేసి ప్రభుత్వంపై వ్యతిరేకతను చాటుకున్న ఉద్యోగులు


పోస్టల్ బ్యాలెట్ ఓట్లను లెక్కింపును పరిశీలిస్తున్న అరకులోయ ఆర్వో అభిషేక్

పాడేరు, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీలోని పాడేరు, అరకులోయ అసెంబ్లీ స్థానాల్లో వైసీపీ అభ్యర్థులు గెలిచినప్పటికీ పోస్టల్ బ్యాలెట్ ఓట్లను పొందడంలో మాత్రం కూటమి అభ్యర్థులు ముందున్నారు. పాడేరులో టీడీపీ అభ్యర్థి గిడ్డి ఈశ్వరికి 1,365, అరకులోయలో బీజేపీ అభ్యర్థి పాంగి రాజారావుకు 848 పోస్టల్ ఓట్లు వచ్చాయి. అంటే వైసీపీ ప్రభుత్వంపై ప్రభుత్వ ఉద్యోగులకు ఉన్న వ్యతిరేకతను ఇలా ప్రదర్శించారని స్పష్టమవుతున్నది.

పాడేరులో వైసీపీకి కంటే టీడీపీకే అధికం

పాడేరు నియోజవర్గంలో వైసీపీ అభ్యర్థి కంటే టీడీపీ అభ్యర్థికే పోస్టల్ బ్యాలెట్ ఓట్లు అధికంగా పడ్డాయి. మొత్తం 2,897 పోస్టల్ ఓట్లకు గానూ.. మత్స్యరాస విశ్వేశ్వరరాజు(వైసీపీ) 837

... మిగతా 8వ పేజీలో

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి

అందరూ మొక్కలు నాటాలి ▸ డీఎఫ్‌వో సూర్యనారాయణ పడాల్


అటవీశాఖ డివిజన్ కార్యాలయంలో మొక్కలు నాటి నీళ్లు పోస్తున్న డీఎఫ్‌వో సూర్యనారాయణ పడాల్

చింతపల్లి, జూన్ 5: పర్యావరణ పరిరక్షణకు అందరూ మొక్కలు నాటాలని డివిజనల్ ఫారెస్టు అధికారి(డీఎఫ్‌వో) చిట్టపులి సూర్యనారాయణ పడాల్ సూచించారు. బుధవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా స్థానిక అటవీశాఖ డివిజన్ కార్యాలయం ఆవరణలో ఉద్యోగులు 200 మొక్కలు నాటారు. ఈ సందర్భంగా డీఎఫ్‌వో మాట్లాడుతూ పెరుగుతున్న భూతాపం వల్ల వాతావరణంలో పెను మార్పులు

... మిగతా 8వ పేజీలో

మన్యంలో భారీ వర్షం

రహదారులు జలమయం

పాడేరు, జూన్ 5:(ఆంధ్రజ్యోతి): నైరుతి రుతుపవనాల ప్రభావంతో మన్యంలో బుధవారం భారీ వర్షం కురిసింది. పాడేరులో ఉదయం నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఆకాశం ఒక మోస్తరు మేఘావృతం కాగా, ఆ తరువాత నుంచి ఒక్కసారిగా భారీ వర్షం కురిసింది. భారీ వర్షానికి రోడ్లన్నీ జలయమం కాగా, పంట పొలాల్లో వర్షపు నీరు భారీగా చేరింది. జన జీవనానికి తీవ్ర అంతరాయం ఏర్పడింది. పాడేరులోని లోతట్టుప్రాంతాలైన నీలకంఠానగర్‌లోని పలు ఇళ్లల్లోకి వర్షపు నీరు వచ్చింది. అయితే తాజా వర్షాలు వేసవి దుక్కి పనులకు అనుకూలిస్తాయని రైతులు అంటున్నారు. అలాగే హుకుంపేటలోని రాళ్ల గెడ్డ, పాడేరులోని బుంగాగెడ్డ, చిలకలమామిడిగెడ్డ, జి.మాడుగుల, పెదబయలు, ముంచంగిపుట్టు మండలాల్లో మత్స్యగెడ్డ, డుంబ్రిగుడలో చాపరాయి గెడ్డ వర్షపు నీటితో ఉధృతంగా ప్రవహిస్తున్నాయి.


మినుములూరు కాఫీ కార్యాలయ సమీపంలో ప్రధాన రహదారిపై భారీ వృక్షం విరిగి పడడంతో స్తంభించిన ట్రాఫిక్

రహదారిపై కూలిన భారీ వృక్షం

పాడేరురూరల్: మండలంలో బుధవారం భారీ వర్షం కురిసింది. ఉదయం 8.30 గంటల సమయంలో మండలంలోని మినుములూరు కాఫీ కార్యాలయానికి సమీపంలో భారీ నేరేడి వృక్షం పాడేరు - విశాఖ ప్రధాన రహదారిపై పడిపోవడంతో రెండు గంటల పాటు ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. దీంతో వాహనచోదకులు ఇబ్బందులు పడ్డారు. అగ్నిమాపక సిబ్బంది సంఘటనా

... మిగతా 8వ పేజీలో


భారీ వర్షానికి తడిసి ముద్దయిన పాడేరు అంబేడ్కర్ సెంటర్


పెదబయలులో వర్షం

వైసీపీ నాయకుల మాటలు నమ్మి మోసపోయాం

- రాజీనామా చేసిన వలంటీర్ల అంతర్మథనం


ఏప్రిల్ 15న రాజీనామా చేసి వైసీపీ నియోజకవర్గ పరిశీలకుడు శ్రీకాంత్‌రాజును కలిసిన చింతపల్లి గ్రామ వలంటీర్లు(ఫైల్)

చింతపల్లి, జూన్ 5: 'వచ్చేది జగన్ ప్రభుత్వమే, మీ ఉద్యోగాలకు ఢోకాలేదు, రాజీనామా చేసి ఎన్నికల ప్రచారంలో పాల్గొనండి' అని వైసీపీ నాయకులు చెప్పడంతో రాజీనామా చేసి మోసపోయామని వలంటీర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మళ్లీ అధికారంలోకి వస్తే ప్రతి ఒక్కరికి తిరిగి ఉద్యోగాలు వస్తాయని చాలా చోట్ల వైసీపీ నాయకులు గ్రామ వలంటీర్లను బలవంతంగా రాజీనామా చేయించారు. గూడెంకొత్తవీధి మండలంలో 10 మంది వలంటీర్లు రాజీనామ చేయగా, చింతపల్లి మండలంలో 335 మంది మూకుమ్మడిగా రాజీనామా చేశారు. రాజీనామా చేసిన ప్రతి వలంటీర్ ఎన్నికల ప్రచారంలో ప్రత్యక్షంగా పాల్గొన్నారు. వైసీపీ పార్టీ కార్యకర్తలుగా పనిచేశారు. అయితే ఈ ఎన్నికల్లో వైసీపీకి కనీసం ప్రతిపక్ష హోదా కూడా రాలేదు. దీంతో వలంటీర్లతో బలవంతంగా రాజీనామాలు చేయించిన వైసీపీ నాయకులు సైతం కనిపించకుండాపోయారు. దీంతో వలంటీర్లలో అంతర్మథనం మొదలైంది. అనవసరంగా వైసీపీ నాయకుల మాటలు నమ్మి రాజీనామా చేశామని, టీడీపీ అధికారంలోకి వస్తే వలంటీర్లకు రూ.10 వేల వేతనం ఇస్తుందని ప్రకటించినా తొందర పడ్డామని వారు ఆవేదన చెందుతున్నారు. కొంత మంది రాజీనామా చేసిన వలంటీర్లు నూతన నియామకాల్లో దరఖాస్తు చేసుకోవచ్చా? అని అధికారుల వద్దకు వచ్చి అడుగుతున్నారు.


విశాఖపట్నంలోని సంస్థ కార్యాలయంలో బుధవారం సాయంత్రం లాటరీ ద్వారా విజేతలను ఎంపిక చేసిన 'ఆంధ్రజ్యోతి' సంస్థ సర్క్యులేషన్ డైరెక్టర్ టి.రామకృష్ణారావు, బ్రాంచ్ మేనేజర్ కె.రామకృష్ణారావు, సిస్టమ్స్ మేనేజర్ ఎం.కిశోర్‌బాబు, సర్క్యులేషన్ ఇన్‌చార్జి సత్యనారాయణ. చిత్రంలో ఇతర సిబ్బంది ఉన్నారు.

'ఎవరు గెలిచినా మీదే గెలుపు' డ్రా

ఉమ్మడి విశాఖ జిల్లాలో ఎన్నికల విజేతలను కచ్చితంగా అంచనా వేసిన నలుగురికి బహుమతులు

- లాటరీ ద్వారా విజేతల ఎంపిక
- కశింకోట మండలం నర్సింగబిల్లి గ్రామానికి చెందిన యర్రా రూపాదేవికి ప్రథమ బహుమతి...

విశాఖపట్నం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల్లో విజేతలుగా ఎవరు నిలుస్తారో అంచనా వేసిన పాఠకులకు నగదు బహుమతులు అందించేందుకు 'ఆంధ్రజ్యోతి' దినపత్రిక నిర్వహించిన 'ఎవరు గెలిచినా మీదే గెలుపు' కాంటెస్ట్ డ్రా బుధవారం సాయంత్రం విశాఖపట్నం లోని సంస్థ కార్యాలయంలో నిర్వహించారు. ఉమ్మడి విశాఖ జిల్లాలోని 15 నియోజకవర్గాల నుంచి వేలాది మంది పాఠకులు కూపన్లు పంపించారు. అందులో సుమారు వెయ్యి మంది వరకూ కూటమి 13, వైసీపీ 2 అసెంబ్లీ నియోజకవర్గాలు గెలుచుకుంటాయని అంచనా వేశారు. ఆ కూపన్ల నుంచి నలుగురు విజేతలను లాటరీ ద్వారా సర్క్యులేషన్ డైరెక్టర్ టి.రామకృష్ణారావు, బ్రాంచ్ మేనేజర్ కె.రామకృష్ణారావు, సిస్టమ్స్ మేనేజర్ ఎం.కిశోర్‌బాబు, న్యూస్ ఎడిటర్ ఎల్.వి.రామాంజనేయులు ఎంపిక చేశారు.

అనకాపల్లి జిల్లా కశింకోట మండలం నర్సింగబిల్లి గ్రామానికి చెందిన యర్రా రూపాదేవి ప్రథమ బహుమతి, అదే జిల్లా ఎస్.రాయవరం మండలం సర్వసిద్ధి గ్రామానికి చెందిన తెప్పల నరసింగరావు, విశాఖ జిల్లా గోపాలపట్నం ప్రాంతానికి చెందిన పీవీ సత్యనారాయణ, గాజువాక సమీపాన గల వడ్లపూడి ప్రాంతానికి చెందిన ద్రోణాద్రి తాతారావు ద్వితీయ బహుమతి దక్కించుకున్నారు. ప్రథమ బహుమతిగా రూ.పది వేలు, రెండో స్థానంలో నిలిచిన ముగ్గురికి ఐదు వేల రూపాయల చొప్పున అందించనున్నారు. ఈ కార్యక్రమంలో సర్క్యులేషన్ విభాగం మేనేజర్ బీఏవీ సత్యనారాయణ, అడ్వర్టైజ్‌మెంట్ విభాగం మేనేజర్ ఆర్.శ్రీనివాస చక్రవర్తి, సీనియర్ స్టాఫ్ రిపోర్టర్ నాళ్ల ఆదినారాయణ, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

నిరుపయోగంగా సంపద కేంద్రాలు

వైసీపీ సర్కారు నిర్లక్ష్యంతో లక్షల వ్యయం వృథా

» పలు పంచాయతీల్లో మెరుగుపడని పారిశుధ్యం

» ఎక్కడికక్కడ పేరుకుపోతున్న చెత్తకుప్పలు

పాయకరావుపేట, జూన్ 5: సంపద కేంద్రాలు చాలాచోట్ల నిరుపయోగంగా మారాయి. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పల్లెల్లో చెత్త సమస్య పరిష్కారంతో పాటు పంచాయతీల ఆర్థిక పరిపుష్టికి వీటిని ఏర్పాటు చేశారు. కానీ ప్రస్తుతం ఇవి పలుచోట్ల లక్ష్యానికి దూరంగా ఉన్నాయి.


పాయకరావుపేటలో ఏర్పాటు చేసిన సంపద కేంద్రం

పట్టణంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో ఏర్పాటుచేసిన ఈ సాలిడ్ వేస్ట్ మేనేజిమెంట్ సిస్టమ్ గత కొన్నేళ్లుగా వినియోగంలో లేక నిరుపయోగంగా ఉంది. దీనివలన పట్టణంలో పారిశుధ్యం మెరుగు పడకపోగా, లక్షల రూపాయల ప్రజాధనం వృధా అయ్యింది. పాయకరావుపేట మేజర్ పంచాయతీలో పరిశుభ్ర వాతావరణం నెలకొల్పడంతో పాటు ప్రతిరోజూ సేకరించిన తడిపొడి చెత్తను పంచాయతీకి ఆదాయం సమకూర్చే విధంగా మార్చేందుకు స్థానిక మంగవరం రోడ్డు శివారులోని శ్మశానవాటిక వద్ద ఏడేళ్ల క్రితం సుమారు రూ.30 లక్షలతో సంపద తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. పట్టణంలోని ఇరవై వార్డుల్లో చెత్త సేకరణకు రెండు ట్రాక్టర్లు, మూడు మినీ వాహనాలు, 27 మూడు చక్రాల రిక్షాలు అందుబాటులో ఉంచారు. పంచాయతీలోని ప్రజారోగ్యశాఖ సిబ్బంది ప్రతిరోజూ పట్టణంలో సేకరించిన తడి, పొడి చెత్తను ఈ కేంద్రానికి తరలించాలి. ఇక్కడ చెత్తను గ్రేడింగ్ చేసి వర్మీ కంపోస్టు తయారు చేయడంతో పాటు పొడి చెత్త, ప్లాస్టిక్, గాజుముక్కలను పిండిచేసి విక్రయించాలి. దీని ద్వారా పంచాయతీకి ఆదాయం సమకూరడంతో పాటు పట్టణంలో పారిశుధ్యం మెరుగుపర్చడం సాలిడ్ వేస్ట్ మేనేజిమెంట్ సిస్టమ్ లక్ష్యం. అయితే పట్టణంలో ఏర్పాటుచేసిన సంపద కేంద్రం నిర్వహణను అధికారులు అప్పట్లోనే పెద్దగా పట్టించుకోకపోగా 2019లో రాష్ట్రంలో వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత వీటిపై మరింత నిర్లక్ష్యం చూపింది. ప్రస్తుతం ఇక్కడ కేవలం పంచాయతీకి చెందిన వాహనాలు నిలిపే షెడ్డుగా మార్చేశారు. చెత్త నిల్వ ఉంచేందుకు ఏర్పాటు చేసిన నాపెడ్ తొట్టెలను పట్టించుకున్నవారు లేక చెత్త కుండీలుగా మారిపోవడంతో పాటు గతంలో ఉత్పత్తి చేసిన వర్మీ కంపోస్టు ఏళ్ళ తరబడి అమ్మకాలు జరక్క మట్టిగా మారిపోయింది.


ముఠా ఆనకట్ట వద్ద పేరుకుపోయిన చెత్త

తాండవ నది గట్టుపై పేరుకుపోయిన చెత్తాచెదారం

ఇదిలావుంటే పాయకరావుపేటకు డంపింగ్ యార్డు లేని కారణంగా సిబ్బంది పట్టణంలో రోజూ సేకరిస్తున్న చెత్తను ముఠా ఆనకట్ట వద్ద తాండవ నది గట్టుపై పారబోస్తున్నారు. దీంతో ఆయా ప్రాంతాలు చెత్తకుప్పలతో అధ్వానంగా మారుతున్నాయి. రాష్ట్రంలో ఏర్పడనున్న కొత్త ప్రభుత్వం పారిశుధ్య సమస్యపై ప్రత్యేక దృష్టి పెట్టడంతో పాటు నిరుపయోగంగా ఉన్న సంపద కేంద్రాలను వినియోగంలోకి తీసుకు రావాలని పలువురు కోరుతున్నారు.

నర్సీపట్నం మండలంలో...

నర్సీపట్నం అర్బన్: మండలంలోని పలు గ్రామాల్లో సంపద కేంద్రాలు నిరుపయోగంగా మారాయి. మొత్తం పదకొండు పంచాయతీల్లో ఇందుకు సంబంధించిన షెడ్లు, చెత్తను నిల్వచేసే కుండీలు తదితరాలను నిర్మించారు. చెట్టుపల్లి, వేములపూడి కేంద్రాలు మినహా మిగిలిన అమలాపురం, ధర్మసాగరం, దుగ్గాడ, గబ్బాడ, గురందొరపాలెం, నీలంపేట, కేఎల్‌పురం, వేములపూడి, యరకన్నపాలెం గ్రామాల్లో ఇవి నిరుపయోగంగా మారాయి. ప్రస్తుతం ఆయా కేంద్రాలు తుప్పలతో దర్శనమిస్తున్నాయి. పారిశుధ్య సిబ్బంది గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి తడి, పొడి చెత్తను సేకరించి సంద కేంద్రాలకు తరలించాలి. అక్కడ చెత్త ఎరువుగా తయారైన తరువాత తిరిగి అదే పంచాయతీలోని రైతులకు విక్రయించేలా చర్యలు చేపట్టారు. దీని వల్ల గ్రామాల్లో చెత్త


నర్సీపట్నం మండలం గురందొరపాలెంలో నిరుపయోగంగా ఉన్న సంపద కేంద్రం

సమస్యకు పరిష్కారంతో పాటు పంచాయతీలకు ఆర్థిక పరిపుష్టి కలుగుతుందన్నది లక్ష్యం. కానీ ఈ మండలంలో ఇందుకు భిన్నంగా తొమ్మిది సందప కేంద్రాలు ఉన్నాయి. ఉన్నతాధికారులు స్పందించి వీటిని వినియోగంలోకి తేవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.


తుప్పలతో దర్శనమిస్తున్న చెత్త కుండీలు

క్రైం... crime news

లారీ ఢీకొని వ్యక్తి మృతి


ముత్యాలనాయుడు (ఫైల్)

కశింకోట, జూన్ 5: మండలంలోని బయ్యవరం వద్ద లారీ ఢీకొన్న ప్రమాదంలో ఒక వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించి సీఐ వినోద్‌బాబు తెలిపిన వివరాలివి. మాడుగుల నియోజకవర్గం కె.కోటపాడు మండలం గొంపవానిపాలెం గ్రామానికి చెందిన గొంప ముత్యాలనాయుడు (36), అతని స్నేహితుడు శంకర్ ఇద్దరూ కలిసి లాలం కొత్తూరు గ్రామానికి ఓ కార్యక్రమం నిమిత్తం విచ్చేశారు. తిరిగి ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి వెళ్తుండగా బయ్యవరం గ్రామం వద్ద ఎలమంచిలి వైపు నుంచి వస్తున్న లారీ వీరి వాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో ముత్యాలనాయుడు తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఇతనికి భార్య లక్ష్మి, ఎనిమిదేళ్ల కుమారుడు ఉన్నారు.

కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ వృద్ధుడు మృతి

అనకాపల్లి టౌన్, జూన్ 5: ప్రమాదవశాత్తు గాయపడి విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ ఓ వృద్ధుడు బుధవారం మృతి చెందినట్టు పట్టణ పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ గణేష్ తెలిపారు. స్థానిక విజయరామరాజుపేటకు చెందిన కణితి జోగినాథం (75) డయాలసిస్ పేషెంట్. ఈయన గత నెల 15వ తేదీ రాత్రి మేడ మెట్లపై నుంచి ప్రమాదవశాత్తూ జారి పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. ఎన్టీఆర్ వైద్యాలయంలో అదే రోజు రాత్రి ప్రథమ చికిత్సల అనంతరం 16వ తేదీన విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ జోగినాథం మృతిచెందినట్టు హెచ్‌సీ చెప్పారు.

12 మంది వైసీపీ కార్యకర్తలపై కేసు నమోదు

గొలుగొండ, జూన్ 5: టీడీపీ శ్రేణులపై దాడికి పాల్పడిన 12 మందిపై వైసీపీ కార్యకర్తలపై కేసు నమోదు చేసినట్టు గొలుగొండ ఎస్‌ఐ కృష్ణారావు తెలిపారు. మండలంలోని చీడిగుమ్మల గ్రామంలో మంగళవారం రాత్రి టీడీపీ నాయకులు, కార్యకర్తలపై వైసీపీ వర్గీయులు దాడి చేసినట్టు అందిన ఫిర్యాదు మేరకు ఈ కేసులు నమోదు చేశామని ఆయన చెప్పారు.

అందరి సహకారంతో ప్రశాంతంగా ఎన్నికలు

» అధికారులు, పోలీసులు, అన్ని శాఖలకు కృతజ్ఞతలు: ఎస్పీ



అనకాపల్లి రూరల్, జూన్ 5 : జిల్లాలో ప్రశాంతంగా ఎన్నికలు జరిగేందుకు కృషి చేసిన పోలీస్ అధికారులు, సిబ్బందికి ఎస్పీ కేవీ మురళీకృష్ణ బుధవారం ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈసీ ఎన్నికల తేదీ ప్రకటించినప్పటి నుంచి జిల్లాలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీస్ యంత్రాంగం, కేంద్ర, రాష్ట్ర పోలీస్ బలగాలు, అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ఎన్నికల ప్రక్రియను విజయవంతం చేశారని పేర్కొన్నారు.

అప్పన్నను దర్శించుకున్న ప్రముఖులు


కప్పస్తంభం వద్ద సీఎం రమేష్ దంపతులు

సింహాచలం, జూన్ 5 : వరాహలక్ష్మీనృసింహస్వామిని పలువురు ప్రముఖులు బుధవారం దర్శించుకున్నారు. అనకాపల్లి పార్లమెంట్ కూటమి అభ్యర్థి సీఎం రమేష్, మాజీ ఎమ్మెల్సీ మాధవ్, భీమిలి నియోజకవర్గం టీడీపీ అభ్యర్థి గంటా శ్రీనివాసరావు, ఆయన కుమారుడు రవితేజ, మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి స్వామి సన్నిధికి విచ్చేశారు. వారికి దేవస్థానం ఇన్‌చార్జి ఈఓ రాధ, ఆలయ ఏఈఓ ఆనందకుమార్ ఆహ్వానం పలికారు. వారంతా కప్ప స్తంభం ఆలింగనం చేసుకున్న తరువాత అంతరాలయంలో అర్చకులు వారి గోత్ర నామాలతో పూజలు చేశారు. గోదాదేవి అమ్మవారి దర్శనం తరువాత పండితులు వేదాశీర్వచనాలీయగా, అధికారులు స్వామివారి ప్రసాదాలు అందజేశారు. ఒడిశా హైకోర్టు న్యాయమూర్తి వి.నరసింహ దంపతులు కూడా వరాహలక్ష్మీనృసింహస్వామిని దర్శించుకున్నారు.

పలు మండలాల్లో కుండపోత

నక్కపల్లి, జూన్ 5 : వాతావరణంలో మార్పుల కారణంగా మండలంలో బుధవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎండ తీవ్రత కొనసాగింది. ఉక్కపోతతో ప్రజలు విలవిల్లాడారు. సాయంత్రం ఆకాశంలో మేఘాలు కమ్ముకుని గంట పాటు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడడంతో అంతటా ఒక్కసారిగా చల్లబడింది. అనేక గ్రామాల్లో రహదారులపై వర్షపు నీరు ప్రవహించింది.

కోటవురట్ల : మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి భానుడ భగభగమండడంతో జనం ఇబ్బందులు ఎదర్కొన్నారు. సాయంత్రం కురిసిన వర్షానికి అంతటా ఒక్కసారిగా చల్లబడడంతో ఉపశమనం పొందారు. లోతట్టు ప్రాంతాల్లో ఎక్కడికక్కడనీరు నిలిచిపోయింది. పల్లె రహదారుల్లో రాకపోలకు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

పాయకరావుపేట రూరల్ : మండలంలో బుధవారం సాయంత్రం భారీ వర్షం కురిశింది. దీంతో సత్యవరం, గోపాలపట్నం, మాసాహెబ్‌పేట, పెంటకోట, మంగవరం, పెదరాంభద్రపురం, శ్రీరాంపురం, కేశవరం తదితర గ్రామాలలోని లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలిచిపోయింది.

ఎస్. రాయవరం : మండలంలోని అన్ని గ్రామాల్లో బుధవారం సాయంత్రం నాలుగున్నర గంటల నుంచి చిరుజల్లుతో కూడిన వర్షం కురిసింది. ఉదయం నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు ఎండ మండింది. ఆ తరువాత ఆకాశం ఒక్కసారిగా మేఘావృతమై పడిన జల్లులతో అంతటా చల్లబడింది.

పరవాడ: మండల కేంద్రం పరవాడ పరిసర ప్రాంతాల్లో బుధవారం సాయంత్రం తేలికపాటి వర్షం కురిసింది. సుమారు గంట పాటు పడడంతో వాతావరణం చల్లబడింది. ఈ వర్షం ఖరీఫ్ సీజన్ దుక్కులకు ఎంతగానో ఉపయోగపడుతుందని రైతులు చెబుతున్నారు.

అమాత్యులు అయ్యేదెవరో?

... 5వ పేజీ తరువాయి

కనీసం ఒకటైనా కూటమి ప్రభుత్వంలో మంత్రి పదవి ఇస్తారని చెబుతున్నారు. ఈ కోటాలో టీడీపీ నాయకులకు అవకాశం ఇవ్వకపోతే జనసేనకు అయినా ఇవ్వాలని గెలిచినవారు కోరుకుంటున్నారు. బీజేపీ విషయానికి వస్తే విశాఖ ఉత్తరం నుంచి గెలుపొందిన విష్ణుకుమార్‌రాజు సీనియర్. గతంలోను అదే నియోజకవర్గం నుంచి గెలిచారు. చంద్రబాబునాయుడుకు సన్నిహితులు. బీజేపీ కోటాలో ఆయనకు చాన్స్ వస్తుందని ఆ పార్టీ వర్గాలు అంటున్నాయి.

కేంద్ర మంత్రిగా శ్రీభరత్?

రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ 16 పార్లమెంటు స్థానాలను గెలుచుకుంది. బీజేపీకి మూడు, జనసేనకు రెండు దక్కాయి. మిగిలిన నాలుగింటిలో వైసీపీ గెలిచింది. ఎన్‌డీఏ భాగస్వామిగా ఉన్న తెలుగుదేశం పార్టీ కేంద్ర ప్రభుత్వంలో చేరబోతోంది. బుధవారం సాయంత్రం ఢిల్లీలో జరిగిన ఎన్‌డీఏ పక్షాల సమావేశానికి తెలుగుదేశం అధినేత చంద్రబాబునాయుడు హాజరయ్యారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రివర్గంలో చేరికపై చర్చ వచ్చినట్టు తెలిసింది. లోక్‌సభ స్పీకర్ పదవితో పాటు, రవాణా, గ్రామీణాభివృద్ధి, జలశక్తి, ఆరోగ్య శాఖలు కోరినట్టు ప్రచారం జరుగుతోంది. టీడీపీ అడిగిన శాఖలు లభిస్తే...అందులో రవాణా శాఖను విశాఖ ఎంపీగా అత్యధిక మెజారిటీతో గెలిచిన శ్రీభరత్‌కు ఇస్తారని ప్రచారం జరుగుతోంది. తొలిసారే పార్లమెంటుకు ఎన్నికైనా ...విద్యావంతుడు కావడంతో ఆయన పేరును పరిశీలనకు తీసుకునే అవకాశం ఉందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	125.00
లైవ్ ధర	145.00
విత్ స్కిన్	260.00
స్కిన్ లెస్	270.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	500
విజయనగరం	504
శ్రీకాకుళం	504

కూటమి నాయకుల చిత్రపటానికి పాలాభిషేకం

» చంద్రబాబు పాలనతో రాష్ట్రానికి మంచిరోజులు : పీలా


కూటమి నాయకుల చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే పీలా

తుమ్మపాల, జూన్ 5: సార్వత్రిక ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డికి రాష్ట్ర ప్రజలు గట్టి బుద్ధి చెప్పారని మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ అన్నారు. ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు విజయదుంధుబి మోగించడంతో బుధవారం అనకాపల్లి పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో నాయకుల చిత్రపటాలకు ఆయన పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో అరాచక పాలనను అంతమొందించేందుకు రాష్ట్ర ప్రజలు నడుం బిగించారన్నారు. ఇందులో భాగంగానే వైసీపీ అడ్రస్ గల్లంతయ్యిందన్నారు. జగన్‌రెడ్డి పాలనపై ప్రజలంతా విసిగిపోయి, చంద్రబాబునాయుడు పాలన కోసం ఎదురు చూశారన్నారు. రాష్ట్రానికి మంచి రోజులు రానున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు మళ్ల సురేంద్ర, గొంతిన శ్రీనివాస్, ఉగ్గిన రమణమూర్తి, బీఎస్ఎంకే జోగినాయుడు, కర్రి బాబి, పోలారపు త్రినాథ్, పచ్చికూర రాము, పల్లెల గంగాభవాని, సందిన సునీల్, మరపురెడ్డి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అయ్యన్న ఇంటి వద్ద టీడీపీ శ్రేణుల విజయోత్సాహం


అయ్యన్నపాత్రుడు ఇంటి వద్ద టీడీపీ నాయకులు, కార్యకర్తలు

నర్సీపట్నం, జూన్ 5: రాష్ట్రంలో టీడీపీ ఘన విజయం సాధించడం.. నర్సీపట్నంలో సీనియర్ నేత అయ్యన్నపాత్రుడు గెలుపొందడంతో పార్టీ శ్రేణుల్లో విజయోత్సాహం నెలకొంది. శివపురంలోని అయ్యన్న ఇంటి వద్ద వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన నాయకులు, కార్యకర్తలతో కోలాహలం కనిపించింది. అయ్యన్నపాత్రుడు పదోసారి ఎమ్మెల్యేగా పోటీచేసి సమీప వైసీపీ అభ్యర్థి పెట్ల ఉమాశంకర్ గణేశ్‌పై 24,676 ఓట్లు మెజారిటీతో ఘన విజయం సాధించడంతో అతన్ని కలిసి అభినందనలు తెలిపారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచి వేలాది మంది నాయకులు, కార్యకర్తలు తరలి వచ్చి ఆయనతో ఫొటోలు దిగడానికి ఎగబడ్డారు. దీంతో అయ్యన్నపాత్రుడు ఇంటి ప్రాంగణం కిక్కిరిసిపోయింది. అలాగే కృష్ణాదేవిపేట రోడ్డులో ట్రాఫిక్ సమస్య ఏర్పడింది.

వైసీపీ అరాచక పాలనకు ఓట్ల రూపంలో గుణపాఠం : బత్తుల


తాతయ్యబాబును సన్మానిస్తున్న టీడీపీ శ్రేణులు

బుచ్చెయ్యపేట, జూన్ 5: అరాచక, దౌర్జన్యాలతో సాగించిన వైసీపీ పాలనపై ప్రజలు నిశ్శబ్దంగా తమ ఆవేశాన్ని ఓటు హక్కు రూపంలో గుణపాఠం చెప్పారని టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు విమర్శించారు. బుధవారం వడ్డాది పార్టీ కార్యాలయంలో తాతయ్యబాబును కలిసి నియోజకవర్గ పరిధి టీడీపీ శ్రేణులు శాలువలు, పూలమాలలతో అభినందించారు. అనకాపల్లిలో కూటమి క్లీన్‌స్వీప్ చేయడంపై వారు ఆయనను అభినందించారు. నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి చేసిన సేవలను పలువురు కొనియాడారు. తాతయ్యబాబు మాట్లాడుతూ చంద్రబాబుపై నమ్మకంతో భారీ విజయం కట్టబెట్టిన ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. నాయకులు సూర్యనారాయణ, వియ్యపు అప్పారావు, మరిసా సతీష్, నరేష్, సింగంపల్లి రమేష్, పడాల గోవింద్ పాల్గొన్నారు.

'పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత'


ఎలమంచిలి కోర్టు ఆవరణలో మొక్క నాటి నీరు పోస్తున్న సివిల్ జడ్జి

ఎలమంచిలి, జూన్ 5 : ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఎలమంచిలి కోర్టు సముదాయం వద్ద బుధవారం సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) పి.విజయ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు అంతా కంకణబద్ధులు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అటవీ శాఖాధికారి పైడిరాజు, పర్యావరణ శాఖ అధికారి ఎ.మూర్తి, శశిప్రభ, బార్ అసోసియేషన్ అధ్యక్షులు ధూళి నూకరాజు, ఉపాధ్యక్షులు పెరుమాళ్ల వెంకట రమణ, కార్యదర్శి బి.హరిశంకరరావు, ఏజీపీ డి.వెంకటరావు, న్యాయవాదులు కె.శ్రీనివాసరావు, డి.రామ్మోహనరావులు తదితరులు పాల్గొన్నారు.

పరవాడ : పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని సింహాద్రి ఎన్టీపీసీ సీజీఎం సంజయ్‌కుమార్ సిన్హా కోరారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా బుధవారం ఇక్కడి దీపాంజలినగర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా మాట్లాడారు. ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణ కోసం కృషి చేస్తామని విద్యార్థులతో కలిసి ప్రతిజ్ఞ చేయించారు. ర్యాలీ నిర్వహించిన అనంతరం వివిధ రకాల మొక్కలు నాటారు. సీపీజీ విభాగం సీజీఎం ఆర్ఆర్ పరిదా, యూనిట్‌లోని వివిధ విభాగాల జీఎంలు, ఏజీఎంలు, ఉద్యోగులు, బాల భారతి పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

అలాగే, పర్యావరణ పరిరక్షణపై విద్యార్థుల్లో చైతన్యం రావాలని జిల్లా విద్యాశాఖాధికారిణి ఎం.వెంకటలక్ష్మమ్మ అన్నారు. పర్యావరణ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా వాడచీపురుపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం 'ప్లాస్టిక్ నిషేధం- పర్యావరణ పరిరక్షణ పై అవగాహన' కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాల ప్రాంగణంలో వివిధ మొక్కలను నాటారు. సర్వశిక్ష అభియాన్, జిల్లా విద్యాశాఖ, ఏపీ ఎన్‌జీసీ సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎస్ఎస్ఏ సీఎంవో బి.శకుంతల, ఎంఈవో దివాకర్‌రావు, ఏపీ ఎన్‌జీసీ జిల్లా కో-ఆర్డినేటర్ ఖగేశ్వరరావు, హెచ్‌ఎం పందిరి కనకేశ్వరరావు పాల్గొన్నారు.

అనకాపల్లి టౌన్ : ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పట్టణంలో పలుచోట్ల ఘనంగా నిర్వహించారు. డైట్ ఇంజినీరింగ్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. ప్రిన్సిపాల్ ఆర్.వైకుంఠరావు వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు. అనకాపల్లి రైల్వేస్టేషన్‌లో స్టేషన్ సూపరింటెండెంట్ సచీ నివాస్ ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణ కార్యక్రమం నిర్వహించారు. రైల్వే ట్రాక్‌ల పరిసరాల్లో మొక్కలు నాటారు. గ్రీన్‌క్లబ్ వ్యవస్థాపకుడు కొణతాల ఫణిభూషణ్‌శ్రీధర్ ఆధ్వర్యంలో గౌరీ గ్రంథాలయంలో వివిధ విభాగాల వారికి చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన డిప్యూటీ డీఈవో పి.అప్పారావు మాట్లాడారు. గ్రంథాలయ కార్యదర్శి కాండ్రేగుల వెంకటరమణ, క్లబ్ గౌరవాధ్యక్షుడు పెంటకోట ఉమా మహేశ్వరరావు, జానకిరావు, వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



దీపాంజలినగర్‌లో విద్యార్థులతో సింహాద్రి సీజీఎం సంజయ్‌కుమార్

నూకాంబిక ఆలయ పాలకవర్గం రాజీనామా


రాజీనామా పత్రాన్ని ఈవోకు అందిస్తున్న చైర్మన్ మురళీకృష్ణ

అనకాపల్లి టౌన్, జూన్ 5: ఉత్తరాంధ్రలో ప్రఖ్యాతిగాంచిన అనకాపల్లి నూకాంబిక అమ్మవారి దేవస్థానం ట్రస్ట్‌బోర్డు పదవులకు చైర్మన్ కొణతాల మురళీకృష్ణ, ధర్మకర్తలు రాజీనామా చేశారు. ఈ మేరకు రాజీనామా పత్రాన్ని బుధవారం ఆలయ ఈవో బండారు ప్రసాద్‌కు అందజేశారు. సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ ఓటమి చెంది ప్రభుత్వ కాల పరిమితి ముగిసిన సందర్భంగా నైతిక బాధ్యత వహిస్తూ తామంతా పదవులకు రాజీనామా చేస్తున్నట్టు చైర్మన్ మురళీకృష్ణ తెలిపారు. ఈవోకు రాజీనామా పత్రం అందించిన వారిలో చైర్మన్‌తో పాటు ధర్మకర్తలు పీలా లక్ష్మి, ఆడారి ఉమా శ్రీనివాసరావు, బుద్ధ నరసింగరాజు, కొండూరు రవీంద్రనాథ్, గొల్లవిల్లి నరసింగరావు, పాము అనురాధ, కంఠపల్లి శోభారాణి, మల్లవరపు ఈశ్వరరావులు ఉన్నారు. తమ పదవీ కాలంలో సహకరించిన ఆలయ అధికారులు, సిబ్బందికి, మాలధారణ సంఘం, భజన మండలి వారికి కృతజ్ఞతలు తెలిపారు.

సింహాద్రి నాల్గో యూనిట్‌లో ఉత్పత్తికి అంతరాయం

పరవాడ, జూన్ 5 : అనకాపల్లి జిల్లా పరవాడ మండలంలో గల సింహాద్రి సూపర్ థర్మల్ విద్యుత్ కేంద్రం (ఎన్టీపీసీ)లోని 500 మెగావాట్ల సామర్థ్యం కలిగిన నాల్గో యూనిట్‌లో ఉత్పత్తికి మంగళవారం అర్ధరాత్రి అంతరాయం ఏర్పడింది. ఈ యూనిట్‌కు సంబంధించిన బాయిలర్ ట్యూబ్‌ల్లో రంధ్రాలు ఏర్పడడంతో ఈ సమస్య ఉత్పన్నమైంది. అధికారులు యుద్ధ ప్రాతిపదికన మరమ్మతు పనులు చేపడుతున్నారు. ప్రస్తుతం ప్లాంట్‌లో ఒకటి, రెండు, మూడు యూనిట్‌లలో మాత్రమే ఉత్పత్తి జరుగుతుందని అధికారులు వివరించారు.

నీట్‌లో ప్రతిభ

» విశాఖ విద్యార్థులకు 322, 304, 360, 442 ర్యాంకులు

» 1000లోపు పాతిక మందికి ర్యాంకులు


జి.రిజియ (528)


బి.జయదీప్ (570)

విశాఖపట్నం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయిలో వైద్య కళాశాలల్లో ప్రవేశాలకు నిర్వహించిన (నీట్-2024) పరీక్షలో విశాఖ విద్యార్థులు మంచి ర్యాంకులు సాధించారు. నగరంలోని కార్పొరేట్ కళాశాలల్లో చదువుకున్న పలువురు విద్యార్థులు 500లోపు ర్యాంకులు సాధించారు. సుమారు పాతిక మంది వరకు 1000లోపు ర్యాంకులు కైవసం చేసుకున్నారు. నగరంలో చదువుకుంటున్న ఎస్.పావని 322వ ర్యాంకు, డి.సూర్యచరణ్ 304, కిరణ్ రాజాన 360, జి.కిషోర్ 442, జి.రిజియ 528, బి.జయదీప్ 570, జె.మారుతి 623, ఆకాష్‌వర్మ 642, డి.శరణ్య 704, పార్థు 872వ ర్యాంకు సాధించారు. ఇంకా రెండు వేల ర్యాంకులోపు 100 మంది, రెండు నుంచి మూడు వేల ర్యాంకు మధ్య రెండు వందల మంది వరకూ ర్యాంకుల సాధించారు. నగరంలో శ్రీచైతన్య, నారాయణ, శ్రీవిశ్వ, ఆకాష్ తదితర కార్పొరేట్ సంస్థలలో చదివిన సుమారు ఐదారు వందల మంది మంచి ర్యాంకులు సాధించారని ఒక కార్పొరేట్ విద్యా సంస్థ ప్రతినిధి ఒకరు తెలిపారు.

రహదారులు వేశారు.. బస్ సర్వీసులు మరిచారు!

- గిరిజనుల అక్కరకురాని పక్కా రోడ్లు
- 72 గ్రామాల ప్రజల రాకపోకలకు ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు, ప్రజా ప్రతినిధులు

ముంచంగిపుట్టు, జూన్ 5: మండలంలో పక్కా రహదారులు ఉన్నా బస్ సర్వీసులు లేకపోవడంతో గిరిజనులు రాకపోకలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సుజనకోట, సుజనపేట, కిలగాడ, లక్ష్మీపురం, కుమడ తదితర ప్రాంతాలకు పక్కా రోడ్లు వేసినా అటుగా ఆర్టీసీ బస్సులను నడపడం లేదు. దీంతో సుమారు 72 గ్రామాల ప్రజలు నిత్యం రాకపోకలు సాగించేందుకు పడరాని పాట్లు పడుతున్నారు. రహదారులు వేసిన ప్రారంభ రోజుల్లో మాత్రం కొన్ని ప్రాంతాలకు ఉదయం, సాయంత్రం వేళల్లో ఒక ఆర్టీసీ బస్సు సర్వీసు తిరిగేది. ఆ సర్వీసులను సుమారు ఆరేళ్ల క్రితం అధికారులు రద్దు చేశారు. దీంతో ఆయా ప్రాంతీయులకు రవాణా కష్టాలు మొదలైయ్యాయి. ఏ చిన్న పాటి అవసరానికైనా కాలి నడకన మండల కేంద్రం వెళ్లాల్సి వస్తుందని గిరిజనులు వాపోతున్నారు.



బస్ సర్వీసులు లేని లక్ష్మీపురం నూతన రహదారి

అలాగే అత్యవసర సమయాల్లో నాటు పడవలపై మత్స్యగెడ్డ దాటుతున్నామని గెడ్డ అవతల గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శనివారం మండల కేంద్రంలో జరిగే వారపు సంతకు అటవీ, వ్యవసాయ ఉత్పత్తులను తీసుకువెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నామని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అలంకారప్రాయంగా లక్ష్మీపురం ప్రధాన రహదారి

మండలంలోని లబ్బూరు జంక్షన్ నుంచి లక్ష్మీపురం వరకు సుమారు రూ.7 కోట్లు వెచ్చించి నూతన రహదారిని నిర్మించారు. ఈ పనులు పూర్తిచేసి సుమారు ఆరేళ్లు కావస్తున్నది. నేటికీ అటుగా ఆర్టీసీ బస్సు సర్వీసును నడపలేదు. పలు మార్లు పాడేరు ఆర్టీసీ డిపోకు చెందిన బస్సును ట్రైల్ రన్‌గా నడిపారు. అయితే ఆ మార్గంలో పలు చోట్ల హెయిర్ పిన్ బెండ్‌ను తలపించేలా మలుపులు ఉండటంతో ఆర్టీసీ బస్సు అటుగా తిప్పడం కష్టమని ఆర్టీసీ అధికారులు చేతులు ఎత్తేశారు. అయితే ప్రమాదకర మలుపులను గుర్తించి బస్సు నడిపేందుకు అవసరమైన విధంగా రహదారిని వెడల్పు చేసి బస్సు నడిచేవిధంగా అధికారులు చర్యలు చేపట్టాల్సి ఉంది. కానీ ఆ దిశగా కనీసం దృష్టిసారించలేదు. దీంతో కోట్లాది రూపాయలు వెచ్చించి నిర్మించిన రోడ్డు నిరుపయోగంగా మారింది. ప్రస్తుతం అటుగా ప్రైవేటు వాహనాలు తిరుగుతున్నాయి. పలు సందర్భాల్లో స్థాయికి మించి ప్రయాణికులు ఎక్కడంతో ప్రైవేటు వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయి. మరిన్ని పెనుప్రమాదాలు జరగకముందే అధికారులు స్పందించి పక్కా రహదారుల సౌకర్యం ఉన్న ప్రాంతాలకు బస్సులు వేయాలని కోరుతున్నారు.

నిరంతర విద్యుత్‌కు ప్రత్యేక చర్యలు

సాంకేతిక సమస్యల పరిష్కారానికి కృషి : ఈపీడీసీఎల్ ఈఈ అప్పారావు

చింతపల్లి, జూన్ 5: గిరిజన ప్రాంతంలో నిరంతర విద్యుత్ సరఫరాకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ఈపీడీసీఎల్ పాడేరు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఏవీఎస్ఎం అప్పారావు తెలిపారు. చింతపల్లి, జీకేవీధి మండలాల్లో తరచూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుండడంతో దీనిపై 'ఆంధ్రజ్యోతి' వరుస కథనాలు ప్రచురించింది. దీంతో ఈపీడీసీఎల్ పాడేరు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ స్పందించారు. ఈ సందర్భంగా ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ చింతపల్లి, జీకేవీధి మండలాలకు నర్సీపట్నం బలిఘట్టం 132/33 కేవి సబ్ స్టేషన్ నుంచి లంబసింగి, చింతపల్లి, జీకేవీధి, ధారకొండ 33 కేవీ సబ్ స్టేషన్ల ద్వారా విద్యుత్ సరఫరా జరుగుతున్నదన్నారు. బలిఘట్టం నుంచి ధారకొండ ఫీడర్ వరకు 116 కిలోమీటర్లు దట్టమైన అటవీ ప్రాంతంలో విద్యుత్ లైన్ ఉందన్నారు. వర్షాకాలంలో సాంకేతిక సమస్య తలెత్తకుండా గత నెలలో విద్యుత్‌లైన్‌లు మరమ్మతులు చేశామన్నారు. గత నెల 31వ తేదీన ఏటిగైరం పేట వద్ద ఇన్సులేటర్ కాలిపోయిందని, ఈ నెల ఒకటిన బలిఘట్టం విద్యుత్ స్టేషన్‌లో ఈఎల్ఆర్ తీసుకున్నామన్నారు. అదే రోజు రాత్రి ధారకొండ లైన్ కొత్తపల్లి వద్ద భారీ వృక్షం విద్యుత్ తీగలపై పడిందని, అలాగే 2వ తేదీన జీకేవీధి లైన్ అంతర్ల వద్ద భారీ వృక్షం విద్యుత్ లైన్‌పై పడిందన్నారు. అర్ధరాత్రి రావిమానుపాకలు వద్ద మరో వృక్షం విద్యుత్ లైన్‌పై పడిందన్నారు. విద్యుత్ లైన్‌లో అర్ధరాత్రి వేళ సాంకేతిక సమస్యలు తలెత్తడం, వృక్షాలు పడిపోవడం వల్ల విద్యుత్ సరఫరాను పునరుద్ధరించేందుకు కొంత జాప్యం జరిగిందన్నారు. విద్యుత్ ఉద్యోగులు చింతపల్లి ఫీడర్‌లో ఎక్కడ సమస్య తలెత్తిందో రాత్రి వేళ కూడా గుర్తించి మరమ్మతులు చేసేందుకు విధులు నిర్వహిస్తున్నారన్నారు. వరుసగా చింతపల్లి ఫీడర్‌లో సాంకేతిక సమస్యలు తలెత్తడం వల్ల చింతపల్లి, జీకేవీధి, పెదవలస, ధారకొండ ప్రాంతాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగిందన్నారు. రానున్న రోజుల్లో ఈ సమస్యను అధిగమించేందుకు విద్యుత్ లైన్ మరమ్మతులు, జంగిల్ క్లియరెన్సు పనులు చేపడుతున్నామని ఆయన తెలిపారు.

అయ్యన్నకు టీడీపీ నేత లక్ష్మణరావు శుభాకాంక్షలు

చింతపల్లి, జూన్ 5: సార్వత్రిక ఎన్నికల్లో విజయం సాధించిన టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు చింతకాయల అయ్యన్నపాత్రుడును పార్టీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి చల్లంగి లక్ష్మణరావు బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. వైసీపీ పెట్టిన కేసులు, అరాచకానికి భయపడకుండా ఎదిరించి నిలబడ్డారని, అందుకే ప్రజలు భారీ మెజారిటీ కట్టబెట్టారని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రి కావడంతో రాష్ట్ర ప్రజలకు శాంతియుత పాలన వస్తుందని, అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని చెప్పారు.



అయ్యన్నకు శుభాకాంక్షలు తెలుపుతున్న లక్ష్మణరావు

అరకులో కూటమి శ్రేణుల సంబరాలు



అనంతగిరిలో సంబరాలు చేసుకుంటున్న టీడీపీ, జనసేన నాయకులు

అరకులోయ, జూన్ 5: రాష్ట్రంలో ఎన్డీయే కూటమి ఘన విజయం సాధించడంతో పార్టీల శ్రేణులు బుధవారం సంబరాలు చేసుకున్నారు. అనంతగిరిలోని ఓ ప్రైవేటు రిసార్ట్సు ప్రాంగణంలో బొర్రా సర్పంచ్ జన్ని అప్పారావు ఆధ్వర్యంలో టీడీపీ, జనసేన నాయకులు కేక్ కట్ చేసి సందడి చేశారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్ ఆధ్వర్యంలో రాష్ట్రం అన్ని విధాలుగా అభివృద్ధి పథంలో నడుస్తుందని ఈ సందర్భంగా బొర్రా సర్పంచ్ జన్ని అప్పారావు, జనసేన మండల అధ్యక్షుడు మరళి ఆశాభావం వ్యక్తం చేశారు. ఏదేమైనా చరిత్రలో మరచిపోలేని విధంగా వైసీపీకి ఓటర్లు తీర్పు ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు ఎస్.సుబ్బారావు, చిట్టిబాబు, రాంబాబు, పైడిరాజు, సన్యాసిరావు, రాజ్‌కుమార్, తమ్మన్న, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కూటమికే పోస్టల్ ఓట్లు అధికం

... 5వ పేజీ తరువాయి

గిడ్డి ఈశ్వరి(టీడీపీ) 1364, వంతాల సుబ్బారావు(స్వతంత్ర) 42, సతకా బుల్లిబాబు(కాంగ్రెస్) 295, సుర్ల అప్పారావు(బీఎస్‌పీ) 27, కింటుకూరి జోసెఫ్(ఇండియా ప్రజాబంధు పార్టీ) 5, మినుముల రాంబాబు(సమాజ్ వాదీ పార్టీ) 0, కిల్లో రంగారావు(భారత చైతన్య పార్టీ) 4, దమంతి నాగేశ్వరరావు(జైభారత్ నేషనల్ పార్టీ) 1, బొంకు అర్జునరావు(జై మహాభారత్ పార్టీ) 11, వల్లా మౌనిక (స్వతంత్ర) 5, అడపా విష్ణుమూర్తి(స్వతంత్ర) 1, ఎస్.శంకరరావు (స్వతంత్ర) 169, చెర్రెకి ఎంప్రైయంబాబు (స్వతంత్ర) 3, డొంకాడ శివప్రసాద్ (స్వతంత్ర) 2, కొక్కుల కన్నబాబు(స్వతంత్ర): 18, నోటాకు 12 ఓట్లు పడగా, 101 ఓట్లు తిరస్కరణకు గురయ్యాయి.

అరకులోయలో కూటమి అభ్యర్థికి 848 పోస్టల్ ఓట్లు

అరకులోయ అసెంబ్లీ స్థానంలో కూటమి అభ్యర్థికే అందరి కంటే అత్యధికంగా పోస్టల్ ఓట్లు పడ్డాయి. వాటిని పరిశీలిస్తే... మొత్తం 3,540 ఓట్లకు గానూ పాంగి రాజారావు(బీజేపీ)కు 848, రేగం మత్స్యలింగం(వైసీపీ)కి 675, శెట్టి గంగాధరస్వామి(కాంగ్రెస్)కు 608, అభ్యర్థి లకే రాజారావు(బీఎస్‌పీ) 682, కిల్లో అనిల్‌కుమార్(లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ) 3, చుంచు రాజుబాబు(గొండ్వాన దండకారణ్య పార్టీ) 8, బురిడి ఉపేంద్ర(జై భారత్ జాతీయ పార్టీ) 0, పుచ్చపుండి రామకృష్ణ(భారత్ ఆదివాసీ పార్టీ) 6, సివేరి అబ్రహం(స్వతంత్ర) 265, చెండా ఏలియా (స్వతంత్ర) 84, కమ్మిడి నిర్మల (స్వతంత్ర) 7, గెమ్మిలి కృష్ణారావు (స్వతంత్ర) 2, నారాజీ మధుబాబు (స్వతంత్ర) 3, మొస్యా సుజాత (స్వతంత్ర) 12, సమర్ది రఘునాథ్ (స్వతంత్ర) 182, వంతల రామన్న (స్వతంత్ర) 61, సమర్ది భవానీ (స్వతంత్ర) 20, నోటాకు 26 పోస్టల్ ఓట్లు పడగా, 38 ఓట్లు తిరస్కరణకు గురయ్యాయి.

పర్యావరణ పరిరక్షణకు కృషి

... 5వ పేజీ తరువాయి

చోటు చేసుకుంటున్నాయన్నారు. కాలానుగుణంగా వర్షాలు పడడం లేదన్నారు. భావితరాలకు మంచి వాతావరణం అందించాలంటే ప్రతి పౌరుడు బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. సాధ్యమైనంత వరకు చెట్లను తొలగించరాదన్నారు. ప్రతి కుటుంబం మొక్కలను పెంచేందుకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. అడవులను సంరక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో లోతుగెడ్డ, పెదవలస, మర్రిపాకలు రేంజ్ అధికారులు బీఎల్ పాత్రుడు, జగదీశ్వరరావు, వర్మ పాల్గొన్నారు.

మాతాశిశు మరణాల నివారణకు పటిష్ఠ చర్యలు

- జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి షేక్ జమాల్ బాషా





చింతగున్నలలో మలేరియా బాధితులను పరామర్శిస్తున్న డీఎంహెచ్‌వో... రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న దృశ్యం

పాడేరు రూరల్, జూన్ 5: మాతాశిశు మరణాలు జరగకుండా వైద్యులు పటిష్ఠ చర్యలు చేపట్టాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి షేక్ జమీల్ బాషా ఆదేశించారు. మండలంలోని మినుములూరు పీహెచ్‌సీని బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. రోగులకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అందుబాటులో ఉంటూ ఆస్పత్రి ఓపీని పెంచాలని వైద్యాధికారి గోపాలకృష్ణకు సూచించారు. అనంతరం మినుములూరు సబ్ సెంటర్‌లో జరుగుతున్న జాతీయ వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమంలో పాల్గొని గర్భిణులు, బాలింతలకు తగిన జాగ్రత్తలను వివరించారు. గత నెలలో మలేరియా పాజిటివ్ కేసులు నమోదైన వనుగుపల్లి పంచాయతీ మారుమూల చింతగున్నలు గ్రామాన్ని సందర్శించారు. రోగుల గృహాలకు స్వయంగా వెళ్లి వైద్యం అందిన తీరును అడిగి తెలుసుకున్నారు. మినుములూరు పీహెచ్‌సీ వైద్య సిబ్బంది అందించిన ఏసీటీ మందులు వాడడంతో ప్రస్తుతం ఆరోగ్యవంతంగా ఉన్నామని బాధితులు తెలపడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం గ్రామంలో ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేసి స్వయంగా వైద్య సేవలు అందించారు. గ్రామ ప్రజలతో మాట్లాడుతూ అపిడిమిక్ సీజన్ అంతా మలేరియా, డెంగ్యూ, టైఫాయిడ్, పచ్చకామెర్లు వంటి వ్యాధులు ప్రబలకుండా ఆరోగ్య సూత్రాలను పాటించాలని సూచించారు. ఇంటింటికీ వెళ్లి ఫీవర్ సర్వే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది బి.ఎలీషారావు, జేవీ.చలం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్నికల్లో అధికారులు, సిబ్బంది పనితీరు భేష్

- అరకులోయ అసెంబ్లీ నియోజకవర్గ అధికారి అభిషేక్



ఎన్నికల అధికారులు, సిబ్బందితో కలెక్టర్ విజయ సునీత, ఐటీడీఏ పీవో అభిషేక్

పాడేరు రూరల్, జూన్ 5: సార్వత్రిక ఎన్నికల్లో అధికారులు, సిబ్బంది అవిశ్రాంతంగా పనిచేశారని, బాధ్యతలను అంకితభావంతో నిర్వర్తించారని అరకు అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, ఐటీడీఏ పీవో వి.అభిషేక్ అభినందించారు. పోలింగ్, పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ విజయవంతం చేశారని ప్రశంసించారు. నోటిఫికేషన్ వెలువడినప్పటి నుంచి ఫలితాలు వెల్లడివరకు అనేక ప్రక్రియల్లో అధికారులు, సిబ్బంది భాగస్వాములయ్యారన్నారు. జూన్ 4న ఓట్ల లెక్కింపు ప్రక్రియలో ఉదయం నుంచి ప్రతి ఒక్కరూ తమ విధులను అంకితభావంతో నిర్వర్తించి నిర్ణీత సమయానికి ఫలితాలు వెల్లడించడంలో కీలక పాత్ర పోషించారన్నారు. అరకు నియోజకవర్గ పరిధిలోని ఏఆర్‌వోలు, సిబ్బంది చక్కగా పనిచేశారన్నారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు, ఓట్ల లెక్కింపు ప్రక్రియ నిర్వహించారని ప్రశంసించారు. అలాగే మీడియా కూడా కీలక పాత్ర పోషించిందని, మీడియా మిత్రులకు ప్రత్యేక ధన్యావాదాలు తెలిపారు. ఈ కార్యక్రమం అన్ని విధాలుగా విజయవంతానికి సహకరించిన ఎన్నికల పరిశీలకులు, ఐటీడీఏ ఏపీవో ఎం.వెంకటేశ్వరరావు, తహసీల్దార్‌లు సుధాకర్, సోమేశ్వరరావులతో పాటు నియోజకవర్గ పరిధిలోని తహసీల్దార్‌లు, రాజకీయ పార్టీల అభ్యర్థులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి

- డీఎఫ్‌వో సూర్యనారాయణ పడాల్
- మన్యంలో పర్యావరణ పరిరక్షణ దినోత్సవం



చింతపల్లిలో మొక్కలు నాటి నీరు పోస్తున్న డీఎఫ్‌వో

పాడేరు రూరల్/చింతపల్లి/ముంచంగిపుట్టు/పెదబయలు/డుంబ్రిగుడ, జూన్ 5: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒకరు మొక్కలు నాటాలని డివిజనల్ ఫారెస్టు అధికారి చిట్టపులి సూర్యనారాయణ పడాల్ అన్నారు. మన్యంలోని పాడేరు, చింతపల్లి, ముంచంగిపుట్టు, పెదబయలు, డుంబ్రిగుడ తదితర మండలాల్లో బుధవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా మండలాల్లో ఎక్కడికక్కడ మొక్కలు నాటి నీరు పోశారు. ఈ సందర్భంగా డివిజనల్ ఫారెస్టు అధికారి మాట్లాడుతూ పెరుగుతున్న భూతాపం వల్ల వాతావరణంలో పెను మార్పులు చోటు చేసుకుంటున్నాయన్నారు. కాలానుగుణంగా వర్షాలు పడడంలేదన్నారు. భావితరాలకు మంచి వాతావరణం అందించాలంటే ప్రతీ పౌరుడు బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. సాధ్యమైనంత వరకు చెట్లను తొలగించరాదన్నారు. ప్రతీ కుటుంబం మొక్కలను పెంచేందుకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. జిల్లా కేంద్రం పాడేరులో పర్యావరణ సమస్యలపై అవగాహన పెంపొందించడం కోసం జిల్లా విద్యాశాఖాధికారి పి.బ్రహ్మాజీరావు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. గ్రీన్ కవర్‌ను పెంచడానికి, గాలి నాణ్యతను మెరుగుపర్చడానికి బాధ్యత, నిబద్ధతను చూపించాలని ఈ సందర్భంగా డీఈవో బ్రహ్మాజీరావు కోరారు. ఈ కార్యక్రమాల్లో ఈ కార్యక్రమంలో లోతుగెడ్డ, పెదవలస, మర్రిపాకలు రేంజ్ అధికారులు బీఎల్ పాత్రుడు, జగదీశ్వరరావు, వర్మ, ఎస్ఎస్ఏ జిల్లా అడిషనల్ ప్రోజెక్టు కో-ఆర్డినేటర్ కె.భాస్కరరావు, ఏఎంవో ఎంజీ.ప్రకాష్, సీఎంవో జి.సింహాచలం, ఏఎస్‌వో కరణం సూర్యకుమారి, జీసీడీవో కూర్మారావు, ఎంఈవో సీహెచ్.సరస్వతీదేవి, హెచ్ఎం విశ్వప్రసాద్, ఉపాధ్యాయులు, సమగ్ర శిక్ష ఉద్యోగులు పాల్గొన్నారు. పెదబయలులో అధికారులు, ఉపాధ్యాయులు మొక్కలు నాటి నీరు పోశారు. పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని పెదబయలు అటవీ శాఖ రేంజ్ అధికారి రాజేశ్వరరావు అన్నారు. అలాగే ముంచంగిపుట్టు, డుంబ్రిగుడ మండలాల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ప్రజా ప్రతినిధులు, అధికారులు గడ్డంగి కమల, రూడి రాజ్‌కుమార్, సుబ్బారావు, డాక్టర్ శిరీష, వైద్య సిబ్బంది సుబ్రహ్మణ్యం, తులసి, రాజేశ్వరి, కాంత తదితరులు పాల్గొన్నారు.

నూకాంబికను దర్శించుకున్న సీఎం రమేష్

అనకాపల్లి టౌన్, జూన్ 5 : ఉత్తరాంధ్రుల ఆరాధ్య దేవత ఇక్కడి నూకాంబిక అమ్మవారిని అనకాపల్లి ఎంపీగా విజయం సాధించిన సీఎం రమేష్ దంపతులు బుధవారం దర్శించుకున్నారు. వీరికి టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్, అచ్యుత దంపతులు గజమాలతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో రమేష్ దంపతులు, రత్నాకర్ దంపతులు పూజలు చేశారు. ఆలయ ఈవో బండారు ప్రసాద్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



మలేరియా నిర్మూలనకు కృషి చేయాలి

తుమ్మపాల, జూన్ 5 : మలేరియా నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తుమ్మపాల పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ వాణి జగదీశ్వరి అన్నారు. మలేరియా వ్యతిరేక మాసోత్సవాల్లో భాగంగా తుమ్మపాల పీహెచ్‌సీ, మార్టూరు తదితర గ్రామాల్లో బుధవారం అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. వైద్య సిబ్బంది బి.మంగమ్మ, బి.సంగం తదితరులు పాల్గొన్నారు.

మన్యంలో భారీ వర్షం



ముంచంగిపుట్టు: రహదారిపై ప్రవహిస్తున్న నీరు

... 5వ పేజీ తరువాయి

స్థలానికి చేరుకొని భారీ వృక్షాన్ని తొలగించడంతో ఎట్టకేలకు వాహనాల రాకపోకలు సజావుగా సాగాయి.





పాడేరు మెయిన్‌లో వర్షం... పాడేరు- విశాఖపట్నం మెయిన్‌రోడ్డులో నిలిచిన వర్షపు నీరు

పెదబయలులో..

పెదబయలు: మండలంలో బుధవారం మధ్యాహ్నం వరకు ఎండ తీవ్రత అధికంగా ఉంది. ఆ తరువాత వాతావరణం మారిపోయి భారీ వర్షం కురిసింది. సాయంత్రం వరకు వర్షం కురవడంతో జనజీవనానికి అంతరాయం కలిగింది.

ముంచంగిపుట్టులో..

ముంచంగిపుట్టు: మండల పరిధిలో బుధవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండ దారెత్తించింది. మధ్యాహ్నం ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. ఉరుములు మెరుపులు, ఈదురు గాలులతో భారీ వర్షం పడింది. స్థానిక నాలుగు రోడ్ల కూడలితో పాటు పలు రహదారులపై నుంచి వరద నీరు ఉధృతంగా ప్రవహించింది. వాగులు వంకలు, మత్స్యగెడ్డ పాయల్లోకి వరద నీరు వచ్చి చేరింది.

సంక్షిప్తంగా..

విజయంలో దూరమైనా సమస్యల పరిష్కారంలో ముందుంటా

పాడేరు అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి గిడ్డి ఈశ్వరి



పాడేరు రూరల్, జూన్ 5: సార్వత్రిక ఎన్నికల్లో విజయానికి దూరమైనా, ప్రజా సమస్యల పరిష్కారంలో ముందు ఉంటానని ఎన్డీఏ కూటమి పాడేరు అసెంబ్లీ టీడీపీ అభ్యర్థిని గిడ్డి ఈశ్వరి అన్నారు. అభ్యర్థిగా బరిలో గెలుపునకు కొంచెం దూరంలో ఆగిన ప్రజా పోరాటంలో ముందుంటానన్నారు. తన విజయానికి ఎన్డీఏ కూటమి టీడీపీ, జనసేన, బీజేపీ నాయకుల కృషికి ధన్యవాదాలు తెలిపారు. అనివార్య కారణాలతో ఓటమి పాలయినప్పటికీ, రాష్ట్రంలో టీడీపీ, కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉండడం వల్ల మన సమస్యలను మనమే పరిష్కరించుకుందామన్నారు. 2024 ఎన్నికల్లో విజయం సాధించిన ఎన్డీఏ కూటమి ఎమ్మెల్యే, ఎంపీలకు ఈ సందర్భంగా ఆమె శుభాకాంక్షలు తెలిపారు.

జాతీయ ఉపకార వేతన పరీక్షలో 44 మంది విద్యార్థుల అర్హత

పాడేరు రూరల్, జూన్ 5: రాష్ట్ర వ్యాప్తంగా డిసెంబరు 3వ తేదీన నిర్వహించిన జాతీయ ఉపకార వేతన పరీక్ష (ఎన్ఎంఎంఎస్)కు సంబంధించిన విడుదలైన ఫలితాల్లో అల్లూరి జిల్లాకు సంబంధించి 44 మంది విద్యార్థులు అర్హత సాధించారని జిల్లా విద్యాశాఖాధికారి పి.బ్రహ్మాజీరావు తెలిపారు. ఎంపికైన విద్యార్థులు జిల్లా విద్యా శాఖాధికారి కార్యాలయం లేదా ప్రభుత్వ పరీక్షల సంచాలకులు వెబ్‌సైట్‌లో ఫలితాలను తెలుసుకోవచ్చని చెప్పారు. మెరిట్ కార్డులు త్వరలో జిల్లా విద్యా శాఖ కార్యాలయానికి వస్తాయన్నారు. జాతీయ విద్యా మంత్రిత్వ శాఖ న్యూఢిల్లీ వారి నియామకాల ప్రకారం ఎంపికైన విద్యార్థులు ఏదైనా జాతీయ బ్యాంక్‌లో విద్యార్థి పేరిట సేవింగ్స్ ఖాతాను తీసుకొని తల్లి లేదా తండ్రిని జాయింట్ చేసుకొని విద్యార్థి ఆధార్ నంబరు మాత్రమే అకౌంట్‌కు లింక్ చేయించాలన్నారు. నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్ తెరిచే సమయంలో ప్రతీ విద్యార్థి అందులో నమోదు చేసుకోవడానికి విద్యార్థి పేరు, తండ్రి పేరు, పుట్టిన తేదీ, మెరిట్ లిస్ట్, మెరిట్ కార్డులో ఉన్న విధంగానే ఆధార్ కార్డులో, బ్యాంక్ పాస్‌బుక్‌లో కూడా అక్షరం తేడా లేకుండా ఉండేలా చూసుకోవాలన్నారు. అందుకు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని డీఈవో సూచించారు.

కూటమి అభ్యర్థుల ఓటమితో గిరిజన యువతకు నష్టం

నిరుద్యోగుల సంఘం నేత రాఘవేంద్రరాజు

చింతపల్లి, జూన్ 5: అరకు, పాడేరు నియోజకవర్గాల్లో కూటమి అభ్యర్థుల ఓటమితో గిరిజన యువత అపార నష్టమని నిరుద్యోగుల సంఘం నాయకుడు బాకూరు రాఘవేంద్రరాజు అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నిరుద్యోగ యువత తలరాతను మార్చే జీవో నంబరు-3 పునరుద్ధరణకు చర్యలు తీసుకుంటామని అరకు వచ్చిన టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు స్పష్టమైన హామీ ఇచ్చారన్నారు. గిరిజన ప్రత్యేక డీఎస్సీ తీసేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారన్నారు. వైసీపీ నవరత్నాల కంటే సూపర్ సిక్స్ పథకాలు అత్యద్భుతంగా ఉన్నాయన్నారు. గిరిజనల కోసం ప్రత్యేక పథకాలను ప్రవేశపెట్టేందుకు పెద్దపీట వేస్తామని చంద్రబాబు ప్రకటించారన్నారు. అయినా గిరిజన ప్రాంత ప్రజలు జగన్ మైకం నుంచి బయటకు రాలేకపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా గిరిజనులు చైతన్యంతో మెలగాలని ఆయన కోరారు.

సీలేరు రహదారిపై నిలిచిన సిమెంట్ లోడ్ లారీ

- వాహనాల రాకపోకలకు తీవ్ర అవాంతరం

సీలేరు, జూన్ 5: గూడెంకొత్తవీధి మండలంలోని సీలేరు జల విద్యుత్ కేంద్రం సమీపంలో సిమెంట్ లోడ్‌తో వస్తున్న లారీ సాంకేతిక లోపాలు తలెత్తి నిలిచిపోయింది. దీంతో ఈ రహదారిలో భారీ వాహనాలు రాకపోకలకు ఇబ్బందులు తలెత్తాయి. తెలంగాణ రాష్ట్రంలోని కోదాడ నుంచి సీలేరుకు సిమెంట్ లోడుతో వస్తున్న భారీ లారీ సీలేరు రోడ్డుపై మలుపు వద్ద మొరాయించింది. డ్రైవర్ వచ్చేపోయే వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తకుండా లారీని పక్కకు పెట్టే ప్రయత్నం చేసినప్పటికీ పూర్తిగా సాధ్యపడలేదు. ప్రమాదకరమైన మలుపు ప్రాంతంలో లారీ చాలా వరకు నిలిచిపోవడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

గసభ ఉపాధ్యాయుడి మృతి

డుంబ్రిగుడ, జూన్ 5: గసభ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్న పెనుమల బాలరాజు మంగళవారం సాయంత్రం మృతి చెందారు. రంపచోడవరం నియోజకవర్గ పరిధిలోని ఎన్నికల విధులు నిర్వహించి స్వగ్రామానికి చేరుకున్నారు. అక్కడ నుంచి అయన అనారోగ్యంతో బాధపడుతూ విశాఖలోని ఓ ప్రవేటు ఆసుపత్రి చికిత్స పొందారు. పది రోజులుగా చికిత్స పొందిన అయన మంగళవారం సాయంత్రం పరిస్థితి విషమించగా అరకులోయ ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి అంబులెన్స్‌లో విశాఖ తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందడంతో కుటుంబీకులు శోక సంద్రంలో మునిగిపోయారు.

సుంకరమెట్ట చర్చిపై పిడుగులు

అరకులోయ, జూన్ 5: సుంకరమెట్టలోని పురాతన చర్చిపై రెండు రోజులుగా పిడుగులు పడడంతో సీసీ కెమెరాలు, వైరింగ్ ధ్వంసమయ్యాయి. ఉదయం 12 గంటల సమయంలో చర్చిలో ప్రార్థనలు జరుగుతుండగా చర్చి టవర్‌పై పిడుగు పడింది. అదే రోజు సీసీ కెమెరాలు, వైరింగ్ కాలిపోయాయి. చర్చి సమీపంలో హైటెన్షన్ టవర్ ఉండడంతో పిడుగులు పడుతున్నాయని, దీంతో సుమారు లక్ష రూపాయలు నష్టం వాటిల్లిందని చర్చి పాస్టర్ నిరీక్షణరావు, నిర్వాహకులు సంజీవ్‌ప్రసాద్, రాజా తెలిపారు.